సీపీఐ పోరాటాల ఫలితంగానే సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సీపీఐ పోరాట ఫలితంగా పట్టణాలలో, గ్రామీణ ప్రాంతాలలో అనేక సమస్యలను పరిష్కరిస్తున్నట్లు సీనియర్ నాయకుడు దుగ్గిరాల నారాయణ రావు పేర్కొన్నారు. మండలంలో ఎర్రంపేట గ్రామంలో నారాయణరావు ఇంటి వద్ద సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ శతవార్షికోత్సవాల సందర్భంగా 2026 జనవరి 18వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో జరిగే భారీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి చింతలపూడి దుర్గారావు, కాశి, పెద్దకాపు, ధర్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు

యశోద కృష్ణ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర - నిడమర్రు: అక్కిన యశోద కృష్ణ జాతీయ స్థాయిలో పరుగు పందెం పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ ఎం. పద్మావతి గురువారం తెలిపారు. నిడమర్రు మండలం బువ్వనపల్లి గ్రామానికి చెందిన అక్కిన ఆంజనేయులు, సరోజిని కుమారుడు యశోద కృష్ణ పెద్దాపురంలో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. పశ్చిమగోదావరి జిల్లా తరఫున 8 కిలోమీటర్ల క్రాస్ కంట్రీ పరుగు పందెంలో యశోద కృష్ణ నాలుగవ స్థానం సాధించాడు. జనవరి 24వ తేదీ నుంచి జార్ఖండ్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడని ఆమె తెలిపారు.యశోద కృష్ణ సాధించిన విజయానికి కృషి చేసిన పిడి పద్మావతిని యశోద కృష్ణను మాజీ శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) సంకు సత్యకుమార్ గ్రామస్తులు అభినందించారు.

భయం గొలుపుతున్న మలుపు

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెం శివాలయం సమీపంలోని ప్రధాన మార్గంలో ఉన్న మలుపు ప్రమాదకరంగా ఉండటంతో వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో యూనియన్, గ్రామీణ బ్యాంకులు, శివాలయం, రామాలయం శ్రీవిద్య పాఠశాల ఉన్నాయి.బ్యాంకులకు వచ్చే వినియోగదారులతో, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో, దేవాలయాలకు వెళ్లే భక్తులతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. ఇక్కడ ఉన్న మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు. జాగ్రత్తలు తెలిపే ఎటువంటి బోర్డులు కూడా లేవు.ఈమలుపు సమీపంలోకి వచ్చే వారంతా ఏమవుతుందనే ఆందోళనతోనే ప్రయాణించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మలుపులో పలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ ఎటువంటి చర్యలు లేవు. ప్రమాదంగా ఉన్న ఈ మలుపులో రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

క్రీస్తుమార్గం మానవాళికి దిక్సూచి

విశాలాంధ్ర -నూజివీడు : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నూజివీడు పట్టణంలోని బేతేలు, ఆర్.ఆర్. పేట, సమతా నగర్లతో పాటు పలు పార్థనా మందిరాలు, కృష్ణ విలాస్ మండపంలో క్రైస్తవ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్టమస్ వేడుకలకు ప్రత్యేక అతిథిగా రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి హాజరయ్యారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా క్రిస్టియన్ సోదరుల అభివృద్ధి, సంక్షేమానికి రూ.150 కోట్లు కేటాయించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. క్రిస్టియన్ సంక్షేమానికి వారి అభివృద్ధికి, జెరూసలేము యాత్రకు, విదేశీ విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించిందని దాన్ని క్రిస్టియన్ సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేవుడి దృష్టిలో మానవులంతా సమానమని, ఎవరికి కావలసిన అవసరాలు వారికి పుట్టించినప్పుడే వారికి సమృద్ధిగా ఇస్తారని తెలిపారు. దేవుని మార్గంలో నడిస్తే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర -భీమవరం: లివర్, కిడ్నీ ఫెయిల్యూర్ కారణంగా మృతి పొందిన కాకినాడ జిల్లా పెద్దపూడి మండలం గంద్రేడు గ్రామం చెందిన వగ్గం శివ (29) కుటుంబ సభ్యులకు కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వగ్గం శివ కుటుంబానికి చైర్మన్ గంటా త్రిమూర్తులు తరఫున రూ.15,000 నగదు ఆర్థిక సహాయాన్ని భీమవరం శ్రీనివాస్ సెంటర్‌లో వగ్గం శివ తల్లి వగ్గం చిట్టమ్మకు, తోట సీతారామలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పులూరి చంద్రశేఖర్, భీమవరం టీడీపీ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన గోవింద్, ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, యలమంచిలి శ్రీనివాసరావు, గూడూరి సుబ్బారావు, గోలగాని రమేష్, కోళ్ల నాగబాబు, విన్నకోట వినాయకబాబు, కాపా అమర్ బాబు, పడమట నరసింహమూర్తి, ఎద్దు యేసుపాదం, కొండ్రు శ్రీనివాస్, నల్లం గంగాధర్, చెరుకు తిరుపతిరావు, బొత్స వెంకట రమణ, ముదురకోల సతీష్, మండపల్లి ఈశ్వరరావు, మద్దుల సాయిరాం, గోలగాని రాంబాబు, మద్దుల మూర్తి, అప్పికొండ గణపతి, తిప్పా బాలముత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర -ముదినేపల్లి : విశ్వవ్యాప్తంగా నిర్వహిస్తున్న సెమీ క్రిస్మస్ వేడుకల అనంతరం క్రిస్మస్ ఆరాధనలతో ముగిశాయి. ముదినేపల్లి మండలంలో ఆర్.సి.యం చర్చిలో ఫాదర్ మరియదాసు, లెమన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ లో బ్రదర్ జాషువా, రమేష్, కర్నేలు, వడాలిలో ఇమ్మాను యేల్ విశ్వాసుల సహవాసం చర్చిలో సిస్టర్ జయ డానియల్, సిఎస్ఐ , బాప్టిస్ట్ , సాల్వేషన్ ఆర్మీ , సిబిసిఎన్ సి , గ్రామ గ్రామాల్లో చర్చిల్లో ఆరాధనల్లో క్రీస్తు జనన సందేశాలు అందించి కేకులు కట్ చేసి పరస్పర క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

క్వార్టర్స్ కు చేరుకున్న మరో 2 జట్లు

విశాలాంధ్ర -భీమవరం టౌన్ :భీమవరంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ పోటీలు హోరాహోరీగా అమలాపురం, తిరుపతి టీమ్స్ క్వార్టర్స్ కు చేరుకున్నాయని నిర్వాహకులు తెలిపారు. తిరుపతి - వైజాగ్‌కు జరగ్గా తిరుపతి 71 పరుగులు చేయగా వైజాగ్ 49 పరుగులు చేసి ఓడిపోయిందని, అమలాపురం-భీమవరం కు జరగ్గా అమలాపురం 117 పరుగులు చేయగా భీమవరం 24 పరుగులు చేసి ఓడిపోయిందని, వైజాగ్ - చెన్నైకు జరగ్గా చెన్నై 68 పరుగులు చేయగా వైజాగ్ 63 పరుగులు చేసి ఓడిపోయిందని, కాకినాడ (కార్తికేయ టీమ్) - కాకినాడ (రుద్ర టీమ్ కు జరగ్గా కార్తికేయ 59 పరుగులు చేయగా రుద్ర టీమ్ 60 పరుగులు చేసి విజయం సాధించిందని, ఖమ్మం - తిరుపతి జరగ్గా తిరుపతి 71 పరుగులు చేయగా ఖమ్మం 41 పరుగులు చేసి ఓడిపోయిందని, చెన్నై - విజయవాడకు జరగ్గా చెన్నై 61 పరుగులు చేసి విజయవాడ 47 పరుగులు చేసి ఓడిపోయిందని, కాకినాడ - వైజాగ్ కు జరగ్గా వైజాగ్ 79 పరుగులు చేయగా కాకినాడ 52 పరుగులు చేసి ఓడిపోయిందని, అమలాపురం - వైజాగ్ కు జరగ్గా అమలాపురం 76 పరుగులు చేయగా వైజాగ్ 58 పరుగులు చేసి ఓడిపోయిందని నిర్వాహకులు తెలిపారు.

ఉద్యమ చైతన్యానికి పునాది సీపీఐ

- వందేళ్ల శతాబ్ది సంబరాల ముగింపు సభ
- ఖమ్మం వేదికగా చారిత్రాత్మక ఘట్టం
- ప్రత్యామ్నాయ రాజకీయాలకు శ్రీకారం

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: ఎరుపు జెండా రెపరెపలతో దేశమంతా ఉద్యమ సంచలనం సృష్టించిన కమ్యూనిస్టు ఉద్యమానికి ఇది ఓ మైలు రాయి. వందేళ్ల పోరాట ప్రస్థానానికి సాక్ష్యంగా ప్రజల దుఃఖాన్ని తనదిగా భావించిన ఉద్యమ చైతన్యానికి పునాది వేసిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో నిర్వహించబోతోంది. ఈ చారిత్రాత్మక సభకు ఉద్యమాల పురిటి గడ్డ ఖమ్మం జిల్లా గర్వంగా నిలుస్తోంది. పార్టీ ఆవిర్భావానికి నాంది పలికిన 1925 నాటి నుంచి, ప్రజల సమస్యలే తన సమస్యలుగా భావించి, వ్యవస్థల మార్పు కోసం నిరంతర పోరాటం చేసిన సీపీఐ ఇప్పుడిప్పుడే వందేళ్లు పూర్తి చేసుకుంటూ, 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనే కొత్త వ్యూహాలపై చర్చించడానికి సిద్ధమవుతోంది.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాధాన్యత

గ్రామీణ బహుజన ఉద్యమాలకు వేదికగా నిలిచిన పశ్చిమగోదావరి జిల్లాల్లో కొండ్రు సుబ్బారావు, అత్తులూరి సర్వేశ్వరరావు, వీరమాచనేని విమలాదేవి, గారపాటి సత్యనారాయణ, రుద్రరాజుసత్యనారాయణ, ఉద్దరాజు రామం, సంకు అప్పారావు, కూనే రావు, ఇలా ఎందరో కమ్యూనిస్టుల ఎన్నో సామూహిక పోరాటాలకు సాక్షిగా నిలిచింది. ప్రత్యేకించి రాజకీయ చైతన్యానికి నిలయం పశ్చిమగోదావరి జిల్లాలో ఉవ్వెత్తున జరిగిన పోరాటాలు, చరిత్ర అద్వితీయం.

ప్రజలకు చేరని స్వాతంత్ర్య ఫలాలు

స్వాతంత్ర్యం సిద్ధించినా నేటికీ ఆ ఫలాలు ప్రజలకు చేరలేదు.వ్యవసాయ సంక్షోభం,రైతుల ఆత్మహత్యలు... కార్మికుల హక్కులకు భంగం,పెరుగుతున్న కార్పొరేటీ కరణ..విద్య,వైద్య రంగాల్లో ప్రైవేటీకరణ ప్రభావం లాంటి సమస్యలు నేడు మన ముందున్నాయి. ఈ సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఎర్రజెండాను భుజానికి ఎత్తుకొని మండల, గ్రామీణ శాఖలలో సమావేశాలు జరుపుతూ సీపీఐ సాధించిన విజ యాలు,ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు కార్యాచరణ,ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేస్తూ సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరు తున్నారు. ప్రజల సమస్యల పట్ల నిబద్ధతతో యువతలో చైతన్యం పెంపొందించే దిశగా వందేళ్ళ భారీసభ కీలక మైలురాయి అవుతుందనడంలో సందేహం లేదు. సామాజిక న్యాయ సంకల్పానికి ఖమ్మం వేదికగా జరిగే ముగింపు సభ అద్దం పడుతుంది.

ఏర్పాట్లతో సందడిగా మారుతున్న ఉమ్మడి పశ్చిమ

జనవరి 18వ తేదీన ఖమ్మంలో జరిగే ముగింపు సభ జయప్రదం చేయడానికి పార్టీ అభిమానులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీపీఐ వారిలో ఉత్సాహం నింపుతోంది. ఇది జిల్లా ప్రజలు గర్వించదగ్గ విషయం. కమ్యూనిస్టు ఉద్యమం మళ్లీ పునర్జీవం కావాల్సిన అవసరం ఉన్న ఈ సమయంలో చరిత్రలో గుర్తుండిపోయే వేదిక అవుతుందని జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఆకాంక్షిస్తున్నారు.

విశ్వాసంతో కూడిన సంకల్పం... భవిష్యత్ పోరాటాలకు కొత్తశక్తి

ఖమ్మం ముగింపు సభ ఎరుపు జెండా కింద నడిచే నిరంతర ప్రజా పోరాటాలకు నూతన దిశను నిర్దేశించనున్నాయి. ఎరుపు రంగు త్యాగానికి సంకేతం, సుత్తి కార్మిక భవిష్యత్తుకు మార్గదర్శనం, కొడవలి శ్రమజీవుల శక్తికి రూపకం. ఈ వందేళ్ళ మహాసభ ప్రజాస్వామ్యానికి పునఃప్రాణం పోసే శక్తిగా, సమాజ మార్పునకు మేలుకొలుపుగా నిలవనున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మట్టిలో నుంచి మరోసారి చైతన్య రేఖలు బయలుదేరుతున్నాయి. ఇది కేవలం ముగింపు సభ మాత్రమే కాదు...వందేళ్ల ఉద్యమ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించే గంభీర పర్యాయం. సీపీఐ జిల్లా నలుమూలల నుంచి కార్మిక, కర్షక, శ్రామిక వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా సమితులు విజ్ఞప్తి చేస్తున్నాయి.

ప్రజలందరికీ అండ ఎర్రజెండా

సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజలందరికీ అండ ఎర్రజెండా అని సీపీఐ జిల్లా సమితి సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అన్నారు. సీపీఐ ఏలూరు ఏరియా 15వ డివిజన్ కార్యదర్శి పుప్పాల కన్నబాబు ఆధ్వర్యంలో, భారత కమ్యూనిస్టు పార్టీ 100వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. 15వ డివిజన్‌లో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రష్యా విప్లవస్ఫూర్తితో 1925 డిసెంబర్ 26వ తేదీన కాన్పూర్లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు 100 సంవత్సరాల కాలంలో దేశ స్వాతంత్ర్యం సాధించడంలో కీలకపాత్ర వహించిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాలను విలీనం చేయడం కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు చేసిందని తెలిపారు. అందులో భాగంగానే తెలంగాణలో ఉన్న నైజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిందని, తద్వారా నైజాం తన సంస్థానాన్ని మనదేశంలో విలీనం చేశారని తెలిపారు. ఈ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సభ్యులు చనిపోయారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య కాలంలో బ్యాంకింగ్ వ్యవస్థ కొద్ది మందికి మాత్రమే అందుబాటులో ఉండేదని సీపీఐ బ్యాంకుల జాతీయకరణ ఉద్యమం నడిపి బ్యాంకులను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకు వచ్చిందని తెలిపారు. సీపీఐ దున్నేవాడికే భూమి దక్కాలని ఇచ్చిన నినాదంతో అనేక చోట్ల పేద ప్రజలకు భూములు దక్కించడం కోసం భూ సంస్కరణల చట్టాన్ని తీసుకు వచ్చేంత వరకు అనేక పోరాటాలను నిర్వహించిందని తెలిపారు. నేడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలకు కమ్యూనిస్టు పార్టీ శతవార్షికోత్సవాల స్ఫూర్తి, ప్రేరణతో ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర పోరాటంలో ప్రజలందరినీ సంఘటిత పరిచి వారిలో దేశభక్తిని రగుల్కొల్పి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేలా చేసిన పార్టీ సీపీఐ అని కొనియాడారు. మతోన్మాద మోడీ ప్రభుత్వం దేశంలోని అన్ని వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తున్నదని అన్నారు. భారతదేశ లౌకిక వ్యవస్థ పరిరక్షణకు, ప్రజాస్వామ్య, మతసామరస్యం కాపాడుటకు కమ్యూనిస్టులు వందేళ్ళ సీపీఐ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్, సీపీఐ నాయకులు బళ్ళ కనకదుర్గారావు, సాయన అభిలాష్, జి. స్వాతి, కొండేటి రాంబాబు, సకురు అప్పలరాజు, పుప్పాల వీర్రాజు, కె. సురేష్, జి. శివ, పి.నూకరాజు, జి. చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ పోరాటాలతోనే ఇళ్ల స్థలాల పంపిణీ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సీపీఐ ఉద్యమ ఫలితంగా రాజవరం గ్రామంలో పేద ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ జరిగిందని సిపిఐ రాజవరం గ్రామ శాఖ కార్యదర్శి రేల నరసింహారావు అన్నారు. మండలంలో రాజవరం గ్రామంలో సిపిఐ శత వార్షికోత్సవాల సందర్భంగా పార్టీ జెండాను నరసింహారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పోరాట ఫలితంగా పేద ప్రజల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రావుల గాంధీ, షేక్.మీరా, సత్యనారాయణ, మృత్యుంజయుడు పాల్గొన్నారు.

ఇరగవరం: సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా తూర్పు విప్పర్రు గ్రామ శాఖ ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు కుడుపూడి వెంకటరెడ్డి పార్టీ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల సమితి కార్యదర్శి నామన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారత దేశంలో దేశ స్వాతంత్ర్యం మొదలుకొని సీపీఐ భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కొరకు రైతాంగ సమస్యలు కార్మిక హక్కుల సాధనకు, విద్యార్థి, యువజన మహిళ యావత్ కార్మిక లోకానికి హక్కులకై పోరాటం చేసిందన్నారు. ఎందరో కమ్యూనిస్టులు ప్రాణాలు అర్పిం చిన పార్టీ సిపిఐ అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డల సత్యనారాయణ, గిద్దా సర్యానారాయణ, గుడిమెట్ల కోటేశ్వరరావు, మాకినిడి రామకోటి, జొన్నలగడ్డ మల్లయ్య, ఉదిసి రామోజి, జొన్నలగడ్డ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

చలో ఖమ్మం జయప్రదం చేయండి

భీమవరం రూరల్ మండల కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్

విశాలాంధ్ర -భీమవరం: వందేళ్ల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, జనవరి 18న ఖమ్మంలో జరిగే సీపీఐ శత వార్షికోత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని భీమవరం రూరల్ మండల కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని భీమవరం రూరల్ మండలం నాగిడిపాలెం, కొత్త పూసలమర్రు, నాగేంద్రపురం గ్రామాల్లో సీపీఐ జెండా ఆవిష్కరించి సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 25న ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ నాటి నుండి నేటి వరకు ప్రజా సమస్యల పైన బడుగు బలహీన వర్గాల సమస్యల పైన రైతాంగ, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మిక చట్టాలు ఏర్పాటు చేయటం కోసం స్వాతంత్ర ఉద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించిందన్నారు. బ్యాంకుల జాతీయకరణ, రాజాభరణాల రద్దు కోసం పోరాడిందని, బంజరు భూములను స్వాధీనం చేసుకొని ప్రజలకు పంపిణీ చేసిన ఘనత సీపీఐదేనని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది యువ కమ్యూనిస్టులను కోల్పోయిన పార్టీ సీపీఐ అన్నారు. తొలుత నాగిడిపాలెంలో నాగిడి గోవిందు కొత్తపూసలమర్రులో వాటాల రాధాకృష్ణ, నాగేంద్ర పురంలో నాగిడి తులసిరావు సీపీఐ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరుమాని కామేశ్వరరావు, తిరుమాని చంటిరాజు విప్లవ గేయాలు ఆలపించారు. ముందుగా మృత వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు నాగిడి తులసిరావు, తిరుమాని కామేశ్వరరావు, శాఖ కార్యదర్శి నాగిడి నాగరాజు, తిరుమాని శ్రీరాములు, నాగిడి గోవిందు, రామ జోగి, తిరుమాని చంటిరాజు, తిరుమాని పెద్దిరాజు, జల్లా గోవిందు తిరుమాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కుక్కలతో బెంబేలు

- కరుస్తూ.. అరుస్తూ
- భయాందోళనలో ప్రజలు
- నియంత్రణ చర్యలు శూన్యం

విశాలాంధ్ర-వీరవాసరం: మండలంలోని ఆయా గ్రామాల్లో కుక్కల దాటికి ప్రజలు హడలెత్తిపోతున్నారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయి పిల్లలు, పెద్దలకు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడే పరిస్థితి నెలకొంది. వీధుల్లో పగలు, రాత్రి సమయాల్లో వాహనాలు వెంబడిస్తూ ప్రమాదాలకు కారణ మవుతున్నాయి.మండలంలోని పలు గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కుక్కలు గుంపులు గుంపులుగా సంచరించడం వల్ల విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. రాత్రి సమయంలో భవనాల పైకి ఎక్కి చేస్తున్న అరుపులకు నిద్ర పట్టడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శునకాలకు భయపడి చిన్నారులు పరుగులు తీయడంతో గాయపడుతున్నారు. శునకాల తో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. శునకాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియడం లేదని చెబుతున్నారు. దీనికి తోడు పలు గ్రామాల్లో పందుల బెడద కూడా ఎక్కువగా ఉందని ప్రజలు చెబుతున్నారు. ప్రజలపై కుక్కలు దాడులు చేస్తున్నా కనీసం అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పూర్తి స్థాయిలో అధికారులు చర్యలు తీసుకొని శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

శాంతి, పరస్పర గౌరవానికి ఇస్కఫ్ కృషి అభినందనీయం : ఐజీ అశోక్‌కుమార్

విశాలాంధ్ర-ఏలూరు: శాంతి, పరస్పర గౌరవం, స్వతంత్రత ఆధారంగా ప్రపంచ రాజకీయాలను ముందుకు తీసుకువెళ్లేం దుకు ప్రజాభిప్రాయాన్ని ప్రోది చేస్తున్న భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) చేస్తున్న కృషి అభినందనీయం అని ఐ.జి.,జి.వి.జి. అశోక్ కుమార్ పేర్కొన్నారు.

2026ఇస్కఫ్ క్యాలెండర్‌ను ఐజి అశోక్ కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధాల నివారణ, పర్యావరణ పరిరక్షణ, శాంతి స్నేహ సాంస్కృతిక సంబంధాల కోసం ప్రపంచవ్యాప్తంగా కృషి చేస్తుందని కొనియాడారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఇస్కఫ్ జిల్లా కన్వీనర్ కడుపు కన్నయ్య మాట్లాడుతూ ప్రజాసంస్కృతి, నైతిక విలువలను కాపాడే ఉద్యమాల్లో ఇస్కఫ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్,ప్రజానాట్య మండలి ఏలూరు జిల్లా కన్వీనర్ బళ్ల కనకదుర్గారావు, న్యాయవాది చిక్కా భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి దాతలు సహకారం అందించాలి : ఎమ్మెల్యే ధర్మరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలం బావాయపాలెం గ్రామంలో వెలసిన పార్వతి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహ మండపం నిర్మాణానికి విరాళం అందించేందుకు దాత ముందుకు రావడంతో గురు వారం ఉంగుటూరు నియోజక వర్గ శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు స్థానిక నేతలతో కలిసి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి, దాత సహకారంతో చేపట్టనున్న నవగ్రహ మండపం నిర్మాణ పనులను వేగవంతంగా ప్రారంభించి నిర్దిష్ట కాలంలో పూర్తి చేయాలని చరవాణి ద్వారా ఆలయ అధికారులకు ఆదేశించారు. నవగ్రహ మండపం నిర్మాణంతో భక్తులకు మరింత ఆధ్యాత్మిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మైలవరపు సురేంద్ర కుమార్, ఆకుల ప్రవీణ్ కుమార్, జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధిగా శ్యామ్, ఉపాధ్యక్షుడిగా పాండురంగారావు

విశాలాంధ్ర - ముదినేపల్లి : ఏలూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా పులవర్తి శామ్యూల్ (శ్యామ్), ఉపాధ్యక్షునిగా పోసిన పాండురంగా రావులను నియమిస్తూ పార్టీ అధిష్టానం నియా మకం చేసింది. ముదినేపల్లి మండలం చిగురు కోట గ్రామానికి చెందిన శ్యామ్, ఊటుకూరు గ్రామానికి చెందిన పోసిన పాండురంగరావు లను పార్టీ అధిష్టానం గుర్తించి వారికి పదవులు రావడంతో మండల టిడిపి నాయకులు అభినందనలు తెలిపారు.

అనుమతుల్లేకుండా మట్టి తవ్వకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు నాగరాజు తెలిపారు. మండలంలో బోడిగూడెం గ్రామ రెవిన్యూ పరిధి ఊట్ల గూడెం గ్రామ శివారున కొండగుట్టలో గత వారం రోజుల నుండి రాత్రి వేళల్లో జెసిబి సహాయంతో లారీలలో కంకర మట్టిని తరలించుకుపోతున్న మట్టి బకాసురులను తహసీల్దార్ నాగరాజు వారి సిబ్బంది లేకుండానే ఒంటరిగా మట్టి తవ్వకాలు జరిపే స్థలానికి అర్ధరాత్రి 12 గంటల సమయంలో చేరుకుని , మట్టిని లోడ్ చేసుకుని వస్తున్న లారీని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో తరలించారు. మంగపతి దేవి పేట గ్రామ శివారులో ఉన్న తాటిపూడి ఎత్తిపోతల కాలువ గట్టు సమీపంలో మట్టిని రాత్రి వేళల్లో జెసిబిల సహాయంతో లారీలలో తరలించుకుపోతున్నారు. రాజకీయ నాయకుల అండదండలతోనే మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మట్టిని తరలించే సమయంలో రహదారిపై విపరీతమైన దుమ్ము లేచిపోతూ ఉందని, కనీసం దుమ్ము లేచిపడకుండా నీటితో కూడా తడపడం లేదని, గ్రామస్తులు తెలుపుతున్నారు. తహసీల్దార్ నాగరాజును వివరణ కోరగా అక్రమ మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, మట్టిని అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

చర్చి నిర్మాణానికి రూ.25వేలు విరాళం

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెం ఆర్.సి. ఎమ్ చర్చిలో క్రిస్మస్ పండుగ సందర్భంగా ధర్మాజీగూడెం వైస్సార్సీపీ నాయకులు మోరంపూడి జగన్ దేవాలయ నిర్మాణం నిమిత్తం రూ.25వేలు విరా ళాన్ని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సొంగా సందీప్ ఆధ్వర్యంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు,చర్చి ఫాదర్ గాబ్రియేలు,మహిళ విశ్వాసులు పాల్గొన్నారు. చర్చి నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాత జగన్‌ను, వైసీపీ నాయకుడు సందీప్‌ను చర్చి నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఫాదర్ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని చర్చ్ ఆఫ్ షాలోమ్‌లో క్రిస్మస్ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. బిషప్ ప్రతాప్ సిన్హా ఆధ్వర్యంలో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీసస్ క్రీస్తు చూపిన శాంతి మార్గంలో ప్రజలంతా పయనించాలని, అందరూ సంతోషంగా సుఖంగా ఉండాలని బిషప్ ప్రతాప్ సిన్హా ఈ సందర్భంగా ఆకాంక్షించారు. క్రిస్మస్ వేడుకలలో భాగంగా ఆయన వేలాది మంది క్రైస్తవ సోదరుల మధ్య ప్రార్థనలు చేసి, శాంతి సందేశం అందించారు. క్రైస్తవ సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

విశాలాంధ్ర
తూర్పుగోదావరి జిల్లా

ఉత్తమ విద్యార్థులకు క్రిస్మస్ ప్రోత్సాహం

విశాలాంధ్ర - తాళ్లపూడి : దైవం పట్ల విశ్వాసంతో చేసే సేవలన్నీ తిరిగి ఆశీర్వాదాలుగా లభిస్తాయని పైడిమెట్టకు చెందిన ప్రత్తిపాటి రత్నాజి రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. తాళ్లపూడి మండలం పైడిమెట్ట కు చెందిన ప్రత్తిపాటి రత్నజిరావు దంపతులు ప్రతి ఏటా క్రిస్మస్ సందర్భంగా మెరిట్ స్కాలర్‌ను ఉత్తమ ఉపాధ్యాయులకు అందచేస్తున్నారు. 2014 నుండి ప్రతి సంవత్సరం లినిస్సి సాగర్స్ మెరిట్ స్కాలర్ పేరు తో గ్రామం లో ఉత్తమ మార్కులు తెచ్చుకున్న విద్యార్థికి నగదు ప్రోత్సాహం తో పాటు, సర్టిఫికెట్, షీల్డ్ అందచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే క్రిస్మస్ వేడుకలలో భాగంగా ఈ ఏడాది 590/600 మార్కులు సాధించిన సిరిగినీడి పూజ సత్యదేవ్‌కు నగదు ప్రోత్సాహం, సర్టిఫికెట్, షీల్డ్ అందించారు.

మత సామరస్యాన్ని గౌరవించాలి

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు

విశాలాంధ్ర-రాజమండ్రి : ప్రపంచ దేశాలలో అన్ని పండగలు జరుపుకునే రోజు డిసెంబర్ 25 క్రిస్టమస్ వేడుక అని నేటి పరిస్థితులలో ప్రతి ఒక్కరు మత సామరస్యానికి కట్టుబడి ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు .గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు ప్రాంతాల్లో క్రిస్టమస్ వేడుకల్లో మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు అనేక సమస్యలపై చక్రవర్తులపై ఏసుక్రీస్తు పోరాటం చేశారని తెలిపారు. ప్రజలకు శాంతి సందేశం ఇచ్చారని అన్నారు. నేటి పరిస్థితులలో పాలకులు ప్రజల్ని అశాంతిని రెచ్చగొడు తున్నారని మండిపడ్డారు. దేవుడిలో ఇరుగు పొరుగు వుండదని ఎవరి నమ్మకం వారిది అన్నారు. భారత దేశం లౌకిక రాజ్యంగా వుందని భిన్న మతాలు, భిన్న భాషలు, భిన్న సంస్కృతులు కలిగి ఉందని అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక రాజ్యం కోసం అందరూ కలిసికట్టుగా సీపీఐతో కలిసి నడవాలని మధు కోరారు.

దేశంకోసం జీవితం త్యాగం చేసిన గొప్పవ్యక్తి వాజ్‌పేయి

విశాలాంధ్ర - అనపర్తి : దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి అని అనపర్తి మండల బీజేపీ అధ్యక్షులు కర్రి బుల్లిరెడ్డి కొనియాడారు. గురువారం అనపర్తి మండలం రామవరం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వగృహం వద్ద "జాతీయ సుపరిపాలన దినోత్సవం" పురస్కరించుకొని సుపరిపాలనకు పర్యాయపదం.. శతాబ్దాలకు తరగని జాతీయ సంపద, జాతీయ భావానికి అమర చిహ్నం, భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బుల్లిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను పట్టణాలకు అనుసంధానం చేయాలని నేషనల్ హైవేలు నిర్మించారని అన్నారు. భారతదేశాన్ని అనుసక్తిగా ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి అని పేర్కొన్నారు. దేశంలోని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిపిన వ్యక్తి ఎవరైనా ఉన్నారు అంటే అది మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మల్లిడి సురేందర్ రెడ్డి, నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి, హేమ తులసి, గంగాభవాని, శ్రీనివాస్ రెడ్డి మరియు ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : పాపులను రక్షించడానికి, ప్రజలను బాధల నుంచి విముక్తుల్ని చేయడానికి, సమాజంలో శాంతి సౌఖ్యాలను పెంపొందించడానికి 2000 సంవత్సరాల క్రితం జీసస్ క్రీస్తు ఉద్భవించారని పాస్టర్ జాన్ వెస్లీ అన్నారు. స్థానిక లాలాచెరువు ప్రాంతంలో ఉన్న హోసన్న మందిరంలో క్రిస్మస్ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, చీకట్లో ఉన్న ప్రజలకు వెలుగులు ప్రసాదించడానికి ఏసు క్రీస్తు ఉద్భవించారన్నారు. లోక కళ్యాణార్థం లోక రక్షకుడిగా వచ్చారని, ఈ రోజున ప్రపంచమంతా జరుపుకునే పండుగ ఏదైనా ఉందంటే అది క్రిస్మస్ అని ఆయన అన్నారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంపి భరత్‌రామ్ మాట్లాడుతూ, చీకటి తరువాత వెలుగులు రావడం ఎంత సహజమో, అదే విధంగా ఈ చీకటి పరిపాలన తరువాత జగన్ తిరిగి ముఖ్యమంత్రిగా వస్తారన్నారు. పాస్టర్ జాన్ వెస్లీ అభ్యర్థన మేరకు తాను తన పదవీ కాలంలో క్రైస్తవ సమాజానికి బరియల్ గ్రౌండ్ నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు. అంతకు ముందు ఫాస్టర్ జాన్ వెస్లీ క్రీస్తు బోధనలు వినిపించి ప్రార్థనలు నిర్వహించారు.

కిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపి భరత్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదరులందరికీ మాజీ ఎంపి భరత్ రామ్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురు వారం ఆయన నగరంలో వివిధ చర్చిలలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు బోధనలు మనుషులందరినీ సన్మార్గంలో నడిపిస్తాయని, కరుణ, ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం వంటి విలువలను జీసస్ బోధించారని చెప్పారు. ఈ సందర్భంగా నగరంలోని సెయింట్ పీటర్స్ చర్చ్, బైబిల్ మిషన్, హోలీ ట్రినిటీ చర్చ్, మరనాత చర్చ్, హోసన్నా మందిరం (లాలచెరువు), జాన్ వెస్లీ చర్చ్ (క్వారీ సెంటర్,) ప్రతాప్ సిన్హా గారి చర్చ్ లో క్రిస్మస్ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పార్టీ నాయకులు దాసి వెంకటరావు, ముప్పన ప్రభాకర్, మదీనా భాషా, నల్ల శ్రీను,చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



శాంతి , ప్రేమలకు నిదర్శనం క్రిస్మస్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : యేసుక్రీస్తు మనందరినీ రక్షించడానికి ఈ లోకంలోకి వచ్చారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హితవుపలికారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించు కుని నగరంలోని సుబ్బారావునగర్, చర్చిపేట, ఏవీ అప్పారావునగర్, లాలా చెరువు, అన్నపూర్ణమ్మపేట, బుచ్చియ్యనగర్ తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో జరిగిన క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసుక్రీస్తు మనందరినీ రక్షించడానికి ఈ లోకంలోకి వచ్చారని , ఆయన మనకు చూపిన దయ, ప్రేమకు కృతజ్ఞతలు తెలుపుకుందామన్నారు.

దుమ్ము లేచిపోతుంది... పట్టించుకోండి సార్!

- ఎడిబి రోడ్డు నిర్మాణ పనుల్లో నెలల తరబడి జాప్యం
- రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, ఇసుక
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు
- రహదారి నిర్వహణను పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - రాజానగరం : తమ ప్రాంతంలో రహదారిపై తరచూ దుమ్ము లేచిపోతుందని, ఆరోగ్యాలు దెబ్బతినే విధంగా ఉన్నాయని తమను పట్టించుకోండి సార్ అంటూ రాజానగరం వాసులు వారి గోడును విశాలాంధ్రకు వినిపించారు. నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం నుండి జిల్లా కేంద్రమైన కాకినాడను అనుసంధానం చేసే ప్రధాన రహదారిని ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంకు(ఏడీబి) నిధులతో చేపట్టారు. రహదారిలో సుమారు ఆరు నెలలు క్రితం వరకు భారీ గుంతలతో వాహనదారులు నరకం చూశారు. ఎట్టకేలకు రహదారి పనులు చేపట్టడంతో సమస్య పరిష్కారమవుతుందని భావిస్తే దుమ్ము, ధూళితో నానా తిప్పలు పడుతున్నారు. రహదారి పనులు నత్తనడకన సాగడంతో ప్రజలు మళ్లీ నరకం చూస్తున్నారు. 2017 -18 ఏడాదిలో గత ప్రభుత్వంలో ఏడీబి నిధులు మంజూరైనప్పటికీ గత ప్రభుత్వం దృష్టి సారించకపో వడంతో ఎడిబి రోడ్డుకు ఈగతి పట్టిందని ప్రయాణికులు వాపోయారు. ఇందుకు సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కాకినాడ జిల్లా నుండి తూర్పు గోదావరి జిల్లా రాజానగరం వరకు నిర్మించనున్న ఏడీబి రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చినప్పటికీ రాజానగరం గ్రామం ప్రారంభం నుండి జాతీయ రహదారి 16 కు అనుసంధానం చేసే వరకు సుమారు కిలోమీటరు దూరం మేరకు రోడ్డు వేయడంలో నెలలు గడుస్తున్నప్పటికి అధికారుల తీరుతో జాప్యం జరుగుతుందని ప్రజలు మండిపడుతున్నారు. దీంతో నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే ఏడీబి రోడ్డు పై మట్టి,ఇసుక పేరుకుపోయి ప్రజలు మళ్లీ నరకం చూస్తున్నారు. దీనికి తోడు రహదారి నిర్మాణ పనులు పూర్తయిన చోట బీటీ నిర్మాణం పనులు చేపట్టకపోవడంతో వెట్ మిక్స్ పైనే రాక పోకలు సాగిస్తున్నారు. వెట్‌మిక్స్ కూడా తడపకపోవడంతో ఏదైన వాహనం వెళితే ఆ వాహనాలు వెనుక దుమ్ము ఉవ్వెత్తున పైకి లేవడంతో అటుగా వెళ్ళే ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు కళ్లలో దుమ్ముపడి ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక చిన్నపాటి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా అటు ఏడీబి అధికారులు కానీ ఇటు రోడ్డు భవనాలు శాఖా అధికారులు కానీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తమ బాధలు ఎవరికి చెప్పాలో తెలియక ఆర్ అండ్ బి అధికారులకు విన్నవిద్దాం అని అధికారులకు ఫోన్ చేస్తే ఫోను సైతం లిఫ్ట్ చెయ్యరని, రెండు మూడు పర్యాయాలు ఫోన్ చేస్తే వాటిని బిజి టోన్‌లో పెట్టేస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారుల తీరుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ప్రభుత్వంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని స్థానికులు వాపోయారు.

రోజుకు నాలుగు సార్లు శుభ్రపరుస్తున్నాం

ఏడీబి రోడ్డు నిర్మాణ పనులను అధికారులు పట్టించుకోకపోవడం, నిర్మాణ పనుల్లో నెలల పడి జాప్యం రావడంతో రోడ్డు సమీపంలోని తమ గృహాల్లోకి దుమ్ము, దూళి వచ్చేస్తుందని,రోజుకు నాలుగు సార్లు శుభ్రపరుస్తున్నప్పటికి దుమ్ము,దూళి దర్శనమిస్తున్నాయని,తమ గృహాలు దెబ్బతింటున్నాయని ఇప్పటికైనా అధికా రులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.

దుకాణాల్లో దుమ్ము

వేలాది రూపాయలు అద్దెలుగా చెల్లించి చిన్నపాటి వ్యాపారాలు చేసుకొని జీవనం సాగిద్దామని తీసుకున్న దుకాణాల లోపలికి దుమ్ము అధికంగా వస్తుందని, తినుబండారాలు,నిత్యావసర వస్తువులు, కూరగాయలు పై దుమ్ము, ధూళి పడుతుందని దీంతో తమ వ్యాపారాలు దెబ్బ తింటున్నాయని,దుమ్ము ఎగరకుండా ఉండేందుకు పొద్దున్న,సాయంత్రం తమ సొంత ఖర్చుతో నీళ్ళు తీసుకువచ్చి రోడ్డును తడుపుతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. నిత్యం రోడ్డుపై నుండి వస్తున్న దుమ్ముతో తమ ఆరోగ్యాలు సైతం దెబ్బతింటున్నాయని పలువురు దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

బడ్జెట్ రాగానే పనుల నిర్మాణం చేపడతాం: ఏడీబి రోడ్డు ప్రాజెక్టు మేనేజర్

ఏడీబి రోడ్డు ప్రాజెక్టు మేనేజర్ చెబోలు మనోహర్ వివరణను కోరగా ఆయన మాట్లాడుతూ 2017 -18 ఏడాదిలో ఏడీబి నిధులు విడుదల చేసిందని,అవి ప్రస్తుతం సరిపోలేదని మరోసారి మంజూరు చేసేందుకు అధికారులకు నివేదక పంపించామని చెప్పారు. సంక్రాంతి తర్వాత ఫ్లై ఓవర్ నిర్మాణం, బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఫ్లై ఓవర్ కోసం భూసేకరణ నష్టపరిహారం కోర్టుకు సైతం చెల్లించినట్టు పేర్కొన్నారు.

టీడీపీ జిల్లా కార్యదర్శిగా చక్రవర్తి

బాణసంచా కాల్చి అభిమానుల ఆనందోత్సాహాలు

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు మండలం వేములూరుకు చెందిన మరపట్ల కళాధర చక్రవర్తిని జిల్లా టిడిపి కార్యదర్శి పదవి వరించింది. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్త స్థాయి నుంచి అనేక పదవులు సాధించి ఈరోజు ఈ స్థితికి చేరుకున్నారు. ఇటీవల వరకు టిడిపి నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జిగా పనిచేశారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ నాయకత్వం వహిస్తూ చురుగ్గా వ్యవహరిస్తున్నారు. పార్టీ నాయకులు,ప్రజల తలలో నాలుకగా వ్యవహరిస్తూ అభినందనలు పొందారు. కళాధర్ కుటుంబం వేములూరు గ్రామానికి ఎన్నో సేవలు అందిస్తూ వస్తున్నారు. కళాధర్ తల్లి పంచాయతీ సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధి కి విశేషంగా కృషి చేశారు. కళాధర్ కు ఈ పదవి లభించడంపై వేములూరు గ్రామస్తులు వర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. తమ నాయకుడుకు జిల్లా కార్యదర్శి పదవి లభించిందన్న వార్త తెలియడంతో గ్రామస్తులు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ప్రాచీన కళలకు కంబాల శ్రీనివాసరావు ప్రోత్సాహం

కోలాటం గజ్జపూజ కార్యక్రమానికి రూ.1,50,000 విరాళం

విశాలాంధ్ర - గోకవరం : గోకవరం డ్రైవర్స్ కాలనీకి చెందిన పలువురు మహిళలు మన ప్రాచీన కాలం నాటి అద్భుతమైన కళలలో ఒకటైన కోలాటం నృత్యాలను నేర్చుకుంటున్నారు. కోలాటం నేర్చుకున్న అనంతరం గజ్జపూజ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి సహాయం అందించాలని, డ్రైవర్ కాలనీకి చెందిన పలువురు మహిళలు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు వద్దకు వచ్చి ఇటీవలే కోరారు. స్పందించిన ఆయన మన ప్రాచీన కళలను ప్రోత్సహించాలన్న సంకల్పంతో వారికి 1,50,000 రూపాయలు విరాళం ప్రకటించారు. విరాళం చెక్‌ను గోకవరం సీఎండీ కార్యాలయం వద్ద మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు, కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత, మనందరిపై ఉందన్నారు. వాటి ప్రోత్సాహానికి తాను ఎల్లప్పుడు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు.



పార్లమెంట్ కమిటీలో సమర్థులకు పదవులు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : సమర్థులకు రాజమండ్రి పార్లమెంట్ కమిటీలో పదవులు దక్కాయని రాజమహేంద్ర వరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. రాజమండ్రి పార్లమెంట్ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కాశీ నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శులు కొయ్యల రమణ, బుడ్డిగ వెంకట రమణి, అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, కార్యదర్శులుగా నియమితులైన జవ్వాది విజయలక్ష్మి, బంగారు నాగేశ్వరరావులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం నుంచి పార్లమెంట్ కమిటీలో ఏడుగురికి స్థానం కల్పించడం శుభపరిణామం అన్నారు. పార్లమెంట్ కమిటీలో రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలోని సభ్యులకు స్థానం కల్పించినందుకు టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ లకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

సుపరిపాలనకు పునాది వేసిన వాజ్ పేయి

ఎంపి పురందేశ్వరి



విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : భారత మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్ పేయి శత జయంతిని పురస్కరించుకుని స్థానిక వాజ్ పేయి సెంటర్ లో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా రాజమండ్రి ఎంపీ శ్రీమతి దగ్గుపాటి పురందేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ, వాజ్ పేయి ప్రధానిగా ఉన్నపుడే సుపరిపాలనకు పునాది వేశారన్నారు. స్వర్ణ చతుర్భుజి జాతీయ రహదారుల నుంచి గ్రామాల్లో అనుసందాన రోడ్ల వరకు నిర్మాణం చేశారని, సర్వ శిక్ష అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించి నిర్బంధ విద్య అమలు చేశారన్నారు. వాజ్ పేయి భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకే కాదు ప్రజలందరికీ ఆదర్శప్రాయులని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గన్నికృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మల దత్తు, కే హారిక, కాలేపు సతీష్ సాయిరాం,అడబాల రామకృష్ణ పరిమిరాదా, ఎనుముల రంగ బాబు ,వీరా వీరాంజనేయులు, రవిశంకర్ , బండి ప్రసాద్, కడప ప్రసాద్ ,తగరం సురేష్ రజిని ,రోహిణి ,భవాని కంచుమర్తి జగన్నాధ రావు లలిత్ జైన్, కొల్ల శీను, రాము తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు పాటు సాయి భక్త సమ్మేళనం

విశాలాంధ్ర - తాళ్లపూడి : శ్రీ షిరిడి సాయి సేవాదళ్ హైద్రాబాద్ వారి ఆధ్వర్యంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా డిసెంబర్ 26,27 తేదీల్లో అఖిల భారత శ్రీ షిరిడి సాయి భక్త సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చైర్మన్ సింహాద్రి జనార్దనరావు, ఫౌండర్ కాళ్ళ రత్నజీ రావు తెలిపారు. బల్లిపాడులోని కాకర్ల రామయ్య ఫంక్షన్ హాలు వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. తాళ్లపూడి రైస్ మిలర్స్ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశం లోని వివిధ ప్రాంతాల్లోని సాయి భక్తులు ప్రసంగిస్తారని తెలిపారు. సాయి సేవలో విశిష్ట అతిథులు కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. 26 శుక్రవారం ఉదయం 7 గంటల నుండి శోభయాత్ర, మొదలు సభప్రారంభం, సాయి భజనలు, సాయి లీలాలు, వేదాంత రహస్యాలు, బాబా ప్రవచనాలు, సాయిబాబా అవతార విసిష్టత, మధ్యాహ్నం హారతి, తీర్థ ప్రసాదం, అన్నప్రసాద వితరణ, అనంతరం ప్రవచనం, భజనలు ఉపనిషత్తుల సారం, సాయి తత్త్వం, అతిథులు కు సత్కారం జరుగు తాయని అన్నారు. రెండవ రోజు శనివారం సాయి భజనలు, సాయి సచరిత్ర సాధన రహ్యాలు ప్రవచనం, గీతలపాన అన్నప్రసాదం, సాయి నామ మహిమ, నేటి సమాజం లో సాయి తత్త్వం ఆవశ్యకత, ముగింపు కార్యక్రమం, సాయి పల్లకి సేవ, ప్రసాద వితరణ ఉంటుంది అన్నారు. భక్తులను సాదరంగా ఆహ్వానిస్తున్నామని, ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.



వాజ్‌పేయికి నివాళి

విశాలాంధ్ర-దేవరపల్లి: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయికి దేవరపల్లి మండల బిజెపి నాయకులు నివాళి అర్పించారు. భారత రత్న,మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఆయన మాటల్లోని కవిత్వం, చమత్కారం, సూక్ష్మమైన వ్యంగ్యం వినేవారిని ఆకట్టుకుని ఆలోచింపజేసేవి అన్నారు. ప్రతిపక్ష నేతలు సైతం ఆయన వాగ్ధాటికి ముగ్ధులయ్యేవారని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి నాయకులు కాట్రగడ్డ రవీంద్ర, దున్న సుమన్ బాబు, నిమ్మగడ్డ శ్రీనివాస్, సాలి రవి కుమార్, ముప్పిడి భాస్కర్ కుమార్ నివాళులు అర్పించారు.

నిర్మలగిరిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో గురువారం నాడు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి క్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్ నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం నిత్య అన్నదానం కాంట్రాక్టర్ కళ్ళే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రం ప్రధాన ఆలయం వద్ద క్రిస్మస్ కేకులు కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్మలగిరి మేరీ క్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్ మాట్లాడుతూ ప్రపంచమంతట క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నారని తెలిపారు. ఏసుక్రీస్తు దీవెనలు ప్రజలందరికీ ఉండాలని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతు లతో ఉండాలని ఆకాంక్షించారు. నిర్మలగిరి పుణ్యక్షేత్రం నిత్య అన్నదానం కాంట్రాక్టర్ కళ్ళే నాగేశ్వరరావు మాట్లా డుతూ పవిత్ర పుణ్యక్షేత్రంలో ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో జీవించాలని అన్నారు. వచ్చిన భక్తులందరికీ గత 25 సంవత్సరాల నుండి నిత్యం అన్నదానం చేస్తున్నామని తెలిపారు. ఏలూరు పీఠాధిపతి పులిమేర జయరావ్ నిర్మలగిరి పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్ ఆశీస్సు లతో అన్నదానం జరుగుతుందని అన్నారు. అంతకుముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పశువుల పాక వద్ద ప్రత్యేక ప్రార్ధన నిర్వహించారు. దిరిసిన ఫాతిమారాణి మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్మలగిరి పుణ్య క్షేత్రంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్నామని, భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొంటారని అన్నారు.

చిలుకూరి ప్రభాకర్ సేవలు ఆదర్శనీయం

డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్

విశాలాంధ్ర - కడియం : నిరుపేద విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం ఉచిత ట్యూషన్ సెంటర్ నిర్వహిస్తున్న చిలుకూరి ప్రభాకర్ సేవలు ఆదర్శనీయమని టిడిపి రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ ప్రశంసించారు. గురువారం ట్యూషన్ సెంటర్ సందర్శించిన డాక్టర్ గోరంట్ల విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బోధనా విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ, సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించాలని సూచించారు. కడియం ప్రభుత్వ హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ప్రభాకర్ చేస్తున్న సేవలను అభినందించారు. ప్రభాకర్ సేవా కార్యక్రమాలలో ఎప్పుడు ఏ సహాయం కావాలన్నా తాను తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కడియం మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి నాని, తమ్మిశెట్టి ప్రసాద్, చిలుకూరు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ బంగారురాజు షూటింగ్ ప్రారంభం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం కోనసీమ బంగారు రాజు సినిమా షూటింగ్ ప్రారంభ మైంది. షణ్ముఖి ఫిలిం క్రియేటర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న కోనసీమ బంగారు రాజు షూటింగ్ కు దేవరపల్లికి చెందిన పారిశ్రామికవేత్త సుతాపల్లి బాబి క్లాప్ కొట్టగా డైరెక్టర్ రామోజీ రావు డైరెక్షన్లో హీరోయిన్ హీరో దాసరి నాగేశ్వరరావు, శ్రీలక్ష్మి పై ఫిలిం చిత్రీకరించారు. ఈ సందర్భంగా నిర్మాత షేక్ కరీం కెమెరామెన్ ఎస్ కే ఆలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామోజీరావు, హీరో దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో దేవరపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీమంతుడు షార్ట్ ఫిలిం షూటింగ్ చేశామని అది ఎంతో విజయవంతమైందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కేశవాచార్యులు దత్తు ప్రత్యేక పూజలు చేసి చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు.

ఆమెన్ ట్రస్ట్ ద్వారా ఉచిత కళ్ళజోళ్లు పంపిణీ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం రామన్నపాలెం కంటి వైద్య శిబిరం ద్వారా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికీ ఆమెన్ ట్రస్ట్ ద్వారా 45 మందికి ఉచితంగా కళ్ళజోళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆమెన్ ట్రస్ట్ చైర్మన్ ఇవాంజలి మాట్లాడుతూ 45 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పౌష్టికాహారం, ఆకుకూరలు, కాలీఫ్లవర్, పాలకూర, ఉసిరి ఆకులు, ఆవాలు, మెంతులు (మెంతికూర), మునగ ఆకులు అద్భుతమైన వనరులన్నారు. ఇవి కంటి చూపునకు ఉత్తమమైన కూరగాయలని తెలిపారు. మేనేజర్ అశోక్ మాట్లాడుతూ కంటికి సంబంధించిన శస్త్రచికిత్సలు శంకర నేత్రాలయ ఏలూరు వారిచే ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఆమెన్ ట్రస్ట్ వారికీ కృతజ్ఞతలు తెలియ చేశారు. టీడీపీ నాయకులు పరిమి కృష్ణ, రామన్నపాలెం ఆరోగ్య గ్రామంగా మారాలని పరిసరాల శుభ్రత తో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర మన లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాట్రగట్ట మోహన్, వెంకటేష్ ,వైసీపీ ప్రెసిడెంట్ రాపాక రేణుక, మున్నంరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జమ్ముల సతీష్‌కు సత్కారం

విశాలాంధ్ర - నల్లజర్ల : 'తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి సీనియర్ తెలుగుదేశం నాయకులు, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్‌ను తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన స్వగృహంలో కూటమి నాయకులు ఆయనకు అభినందనలు తెలియచేసి సాలువాతో సత్కరించారు. ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆటో యూనియన్ సభ్యులు అచ్చన్నపాలెం కూటమి నాయకులు పాతూరి రమేష్, పాతూరి ఆదినారాయణ, ఉన్నమట్ల విశాక్ పలువురు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి కాకినాడ జిల్లా

పోటీ పరీక్షల్లో అగ్రగామిగా నిలవాలి

ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : పోటీ పరీక్షలకు సంబంధించి అన్ని విభాగాల్లో కాకినాడకు చెందిన శ్యామ్ ఇనిస్టిట్యూట్ అగ్రగామిగా నిలవాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఈ ఏడాది వివిధ పరీక్షల్లో గణనీయమైన ఫలితాలు సాధించిందని అదే తరహాలో శ్యామ్ ఖ్యాతి జాతీయ స్థాయికి చేరాలని ఎంపీ తంగెళ్ల అన్నారు. గురువారం శ్యామ్ ఇన్స్టిట్యూట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిజికల్ గ్రౌండ్స్‌ను ఎంపీ తంగెళ్లతో పాటుగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల ట్రైనింగ్ విభాగాలను పరిశీలించారు. శ్యామ్ ఇన్స్టిట్యూట్ దినదినాభివృద్ధి చెందాలని తంగెళ్ల, రాజశేఖర్, నానాజీలు కోరారు. శ్యామ్ సంస్థలో విద్యార్థులను ప్రతిభావంతులుగా, ఉన్నత ఉద్యోగ అవకాశాల్లో తీర్చి దిద్దుతున్న డైరెక్టర్ శ్యామ్ అతని బృందాన్ని కాకినాడ జిల్లా పోలీస్ అదనపు ఎస్పీ ఎ శ్రీనివాసరావు అభినందించారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టిడ్కో రుణాలు తక్షణం రద్దు చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : మండపేట గొల్లపుంతలో నిర్మించిన టిడ్కో ఇళ్ల రుణాలను తక్షణం రద్దు చేయాలని మండపేట నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు డిమాండ్ చేశారు. మండపేట విజయలక్ష్మి నగర్‌లోని వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రచారంలో టిట్కో రుణాలు రద్దు చేస్తామని ఎమ్మెల్యే వేగుళ్ళ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇటీవల రెండో విడత అపార్ట్మెంట్‌లు ప్రారంభ కార్యక్రమానికి తాను వెళ్లానని అక్కడ ఈ విషయాలు మాట్లాడితే సభను తప్పుదోవ పట్టించడానికి తాను ప్రయ త్నించాననీ అంటూ దుష్ప్రచారం చేస్తారనే ఉద్దేశంతో ఆనాడు మాట్లా డలేదని పేర్కొన్నారు. నాలుగు అంతస్తులు ఆలోచన లేకుండా ఆనాడు నిర్మించారన్నారు. తక్షణమే ఆయా అపార్ట్మెంట్లకు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి అయ్యే వ్యయాన్ని ప్రభుత్వం భరించాలని, మెయింటైన్ చార్జీలు కూడా ప్రభుత్వ భరించాలని పేర్కొన్నారు. టిడ్కో లబ్ధిదారులు విపరీతంగా ఇబ్బందులు పడి బాధ పడుతున్నారని వాపోయారు. తమ ఇక్కట్లు మంత్రి నారాయణ చెప్పుకుందామని వెళితే వెళ్లకుండా పోలీసులు నియంత్రించారని ఆరోపించారు. 2019 ఎన్నికల ముందు గృహప్రవేశాల పేరిట హడావిడి చేసి , కనీసం సెప్టిక్ ట్యాంకులు తాగునీరు పూర్తి చేయకుండా రిబ్బన్ కట్ చేసేసారని ఎద్దేవా చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసినట్లు వివరించారు. వాటర్ ట్యాంకు పైప్ లైన్, మరుగుదొడ్ల ట్యాంకర్ పనులతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. ఇపుడు రెండో విడతలో 2 వేల ఇల్లు ఇచ్చామంటూ ప్రచారం చేసుకుంటున్నారని గతంలో ఇచ్చిన అపార్ట్మెంట్‌లో బ్లాకుల్లో కాపురం చేస్తున్న వారు పడే బాధలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. వారు నరకంలో ఉంటున్నారని పేర్కొన్నారు. నరకంలో ఉంటున్నారనే మాట తాను అనడం లేదని గత ఎన్నికలకు ముందు కాలనీలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రచారం నిర్వహిస్తూన్నారని పేర్కొన్నారు. ఎన్నికల అవసరాల కోసం ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం ఆయనకు అలవాటేనని మండిపడ్డారు. టిడిపి నేతలు అవకాశవాదులు అని అవసరం తీరిన తర్వాత చేతులు దులుపుకొని పోయే రకమని విమర్శించారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి తర్వాత జగన్మోహన్ రెడ్డి సొంత వ్యక్తిగత ఇంటి నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. జగన్ హయాంలో 20 లక్షల మందికి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట గుర్తు చేశారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ విదేశాల్లో అత్యుత్తమ డిజైన్ పరిశీలించి షేర్ వాల్ టెక్నాలజీ వాడమని చెబుతున్నారని ఇదేం టెక్నాలజీ అంటూ ప్రశ్నించారు. గతంలో అపార్ట్మెంట్లు నిర్మించే ముందు చదరపు గజానికి రూ.వెయ్యి ఇస్తే తాము నిర్మించేస్తామని ఇక్కడి స్థానిక వైసిపి నాయకులు ప్రకటన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లో చదరపు గజానికి రూ. 1800 వసూలు చేసి కొన్ని వేల కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. అక్కడ ఇబ్బందులు పడుతూన్న వారి ఉసురు ఎమ్మెల్యే వేగుళ్ళకు తగులుతుందని పేర్కొన్నారు. అపార్ట్మెంట్లలో నివసిస్తున్న కనీసం వంద మందిని తాము ఆనందంగా ఉన్నామని చెప్పించమని తోట సవాలు విసిరారు. అక్కడ వారిని అడుగుదాం మూడు నాలుగు ఫ్లోర్లలో ఎవరైనా కాపురం ఉంటున్నారేమో చూద్దాం రండి అంటూ సవాల్ విసిరారు. నీళు లేవు డ్రైనేజీ వ్యవస్థ లేదని దుయ్యబట్టారు. షేర్ వాల్ టెక్నాలజీతో ఆయా నాయకులు ఇల్లు ఎందుకు నిర్మించుకోవడంలేదని ప్రశ్నించారు. మేకులు కొట్టే వీలు లేని పరిస్థితి ఉందని వాపోయారు. బ్యాంకు రుణాలు రద్దు చేస్తామని ఎన్నికల ముందు చెప్పారని ఇపుడు ఈ విషయం ఎక్కడ మాట్లాడ్డం లేదని తప్పు పట్టారు. టిడ్కో గృహాలలోన్ బ్యాంక్ ఖాతాలో డబ్బులు పడితే మహిళలకు డ్వాక్రా రుణాలు ఇతర లావాదేవీల ద్వారా వచ్చిన సొమ్మును బ్యాంకు వాళ్లు నిర్దాక్షిణ్యంగా వచ్చినవి వచ్చినట్టే కట్ అయిపోతున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అపార్ట్మెంట్ సమస్యలపై చర్చించడానికి ఎమ్మెల్యే వేగుళ్ల వస్తానంటే తాను సిద్ధమేనని సవాల్ చేశారు. లక్ష రూపాయలు అపార్ట్మెంట్ వద్దనుకునే వారికి డిపాజిట్ సొమ్ము వడ్డీతో సహా చెల్లించాలని పేర్కొన్నారు. రుణాలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల్ని టిడిపి పలు రకాలు మోసం చేస్తుందని దుయ్యబట్టారు. ఇప్పుడున్న నరకాన్ని ఏర్పాటు చేసింది ఎమ్మెల్యే జోగేశ్వరరావునని ఎద్దేవా చేశారు. లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, జిల్లా జనరల్ సెక్రటరీ యర్రగుంట అయ్యప్ప, రూరల్ కన్వీనర్ అడబాల బాబ్జీ, పిల్లా వీరబాబు, పాలికి శ్రీను, దార్ల సతీష్ కుమార్, పోతుల ప్రసాద్, జొన్నపల్లి సత్తిబాబు, పోలిశెట్టి గణేష్, పోతుల రాంబాబు, చింతా సురేష్ రెడ్డి, మీగడ శ్రీనివాస్, యర్రంశెట్టి నాగేంద్ర, యర్రంశెట్టి సత్యనారాయణ, వీధి గంగాధరరావు, మద్దింశెట్టి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కోసమే మా కుటుంబం -నిమ్మకాయల రంగ నాగ్

విశాలాంధ్ర - సామర్లకోట : కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన యువ నాయకులు నిమ్మకాయల రంగనాగ్‌ను కాకినాడ జిల్లాలోని తెలుగుదేశం పార్టీ నాయ కులు కార్యకర్తలు పెద్దాపురం నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు అచ్చంపేటలోని ఎమ్మెల్యే రాజప్ప నివాసం వద్దకు చేరుకుని నిమ్మకాయల రంగనాగ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకుల్ని కార్యకర్తలను ఉద్దేశించి రంగనాగ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న కష్టకాలంలో ఉన్న ఎప్పుడూ మా కుటుంబం తెలుగుదేశం పార్టీ పటిష్టతకు నిర్మాణానికి ఎప్పుడూ పాటుపడుతుందని తన తండ్రి పెద్దాపురం ఎమ్మెల్యే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 20 సంవత్సరాలు పాటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పనిచేసి అందరిని సమన్వయం చేసుకుంటూ పార్టీని ముందుకు తీసుకెళ్లారని ఇక మీదట కూడా పార్టీ కోసం మా కుటుంబం ఎప్పుడు పని చేస్తూనే ఉంటుందని కార్యకర్తలకు నాయకులకు ఎప్పుడు అందుబాటులో ఉంటామని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ విజయాల్లోనూ కష్ట కాలంలోనూ వెన్నంటే ఉండి అందరికీ అందుబాటులో ఉండడం తన తండ్రి రాజప్పలాగే అందరికీ అందుబాటులో ఉంటూ వివాదాల జోలికి వెళ్లకుండా పార్టీ కోసం పాటుపడుతుండడం వల్లే కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు పదవి దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కొండబాబు

విశాలాంధ్ర - కాకినాడ : ప్రభువైన ఏసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే క్రీస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమ ణులందరికీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కాకినాడ జగన్నాథపురంలోని చర్చి స్క్వేర్ సెంటర్ వద్ద గల సెంటినరీ ఆంధ్ర బాప్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు సిహెచ్ యేసుదాసు ఎమ్మెల్యే కొండబాబుకు ఘన స్వాగతం పలి కారు. ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ, ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, శాంతి, కరుణ, సహనాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించి సమాజహితానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. అందరూ సుఖసంతోషాలతో ఆనం దంగా క్రీస్మస్ పండుగను జరుపుకోవాలని ప్రార్థిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొండబాబు పేదలకు వస్త్రాలు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వి సుధారాణి, కోశాధికారి డివి రమణ, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, సలహాదారులు ఎ శామ్యూల్, కె సుభద్ర, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆరు సినిమా ప్రారంభం... క్లాప్ కొట్టిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఐ పోలవరం : పోలవరం మండలం బాణాపురం గ్రామానికి చెందిన పి చంటిబాబు (ఆరు స్వామి) దర్శక, నిర్మాతగా నూతనంగా నిర్మిస్తున్న చిత్రానికి ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు గురు వారం అరుస్వామి కార్యాలయంలో క్లాప్ కొట్టి ప్రారంభించారు. దర్శకుడు ఆరుస్వామి చెప్పిన వివరాల ప్రకారం, హైందవి1 బ్యానర్ పై, చదుర్గ సమర్పణలో సర్పంచ్ వీర రాఘవ చిత్రం తెరకెక్కుతుందన్నారు. ఈ సినిమాకు ప్రారం భోత్సవ ముహూర్తం గురువారం రావడంతో చిత్రయూనిట్‌తో కలిసి, వేద పండితులు సాక్షిగా పూజ జరిపించారు. సంక్రాంతి తర్వాత దిల్ రమేష్ కథానాయకుడిగా, కథానాయకిగా అపరంజిత ఇతర సీనియర్ నటీనటులతో కోనసీమ ప్రాంతంగా, సినిమాలో సన్నివేశాలు చిత్రీకరిస్తామని అన్నారు. దర్శకుడు ఆరు మాట్లాడుతూ కోనసీమలో కొన్ని ప్రాంతాల్లో జరిగిన, యదార్థ సంఘటనలు ఆధారంగా చేసుకుని ఈసినిమా తెరకెక్కించి బోతున్నామని, కోనసీమ వాసిగా గుర్తించి ఆదరించాలని, స్థానిక శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజునీ, తన సొంత మండలమైన ఐ పోలవరం పెద్దలను, ముమ్మిడివరం నియోజక పెద్దలను పాత్రికేయలను కోరడం జరిగింది. ముఖ్యంగా ఈ సినిమాలో ముఖ్య మైనపాత్ర పోషిస్తున్న ముమ్మిడివరం మున్సిపల్ కమిషనర్ పి రవివర్మకు చిత్ర యూనిట్ తరపున దుస్సాలవాతో సత్కరించి, ధన్యవాదములు తెలిపారు. ఎన్నో బిజీ పనులు ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఈచిత్ర ప్రారంభోత్సవానికి రావడం, నన్ను చిత్ర యూనిట్ను ఆశీర్వదించడం సంతోషంగా ఉందని ఆరుస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లాఅధ్యక్షులు గుత్తుల సాయి శ్రీనివాస్, వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షులు పిన్నమరాజు వెంకటపతి రాజు, కాంగ్రెస్ నాయకులు జగ్గప్పరాజు, కోమనపల్లి సర్పంచ్ కాశి రామకృష్ణ, గుత్తెనదీవి ఎంపిటిసి లంకలపల్లి రాణి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ జోలికి పోవద్దు : ఎస్ఐ

విశాలాంధ్ర - జగ్గంపేట : యువత డ్రగ్స్ జోలికి పోవద్దు బ్రో అనే సంకేతంతో గ్రామంలోని ప్రజలతో ముఖాముఖి జగ్గంపేట సిఐ వైఆర్‌కె శ్రీనివాస్, జగ్గంపేట బృందం కలిసి గురువారం మల్లీసాల గ్రామంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. యువత పెడదారిన పట్టి డ్రగ్స్‌కు అలవాటు పడటం వల్ల వారు మత్తుకు అలవాటు పడి, అనవసరపు ఖర్చులకు బానిసలై సైబర్ మోసాల వరకు వెళ్లపోతున్నారని తల్లిదండ్రులు గమనించి వారి నడవడికను ప్రతినిత్యం ఒక కంట కనిపెడుతూ ఉండాలన్నారు. మహిళలు తప్పనిసరిగా శక్తి యాప్‌ను ఉపయోగించుకోవాలని దాని వల్ల కలిగే ప్రయోజనాలను సవివరంగా తెలియజేశారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెల్మెట్లను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలన్నారు. జగ్గంపేట టీ రఘునాథరవుతో పాటు ఏఎస్సైలు శేఖర్, భైరవ స్వామి, సిబ్బంది నరాల సత్యనారాయణ, సోమరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వందలాది మది ప్రజలు పోలీసు శాఖ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి విచ్చేశారు.

కూటమి నేతల క్రిస్మస్ కానుకలు పంపిణీ



విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : క్రిస్మస్ సందర్భంగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంక టేశ్వరరావు (నానాజీ) అధ్వర్యంలో తూరంగి లో ఉన్న 18 చర్చిల్లోని దైవజనులకు 4000 కేక్స్, 32 పాస్టర్స్‌కు గిఫ్టులు కూటమి సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షులు పితాని తేజ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుండి నియోజక వర్గంలో ఉన్న అన్ని చర్చిలకు ప్రతి సంవత్సరం కేక్స్ గిఫ్ట్ పంపిణీ చేస్తున్నామన్నారు. పదవి లేనప్పుడు ప్రజల కోసమే పాటు పడ్డ నాయ కుడు నానాజీ అని, మీ ప్రార్థనలతో మా నాయకుడు గెలుపునకు దీవెనలు అందించిన మీ అందరికీ ఈ సందర్భంగా ధన్య వాదాలు తెలిపారు. ప్రజా క్షేమం కోసం పాటుపడే ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ వీరికి క్రీస్తు ఆశీస్సులు ఉంటాయని ప్రార్థన చేశారు. మాజీ ఎంపీటీసీ పితాని రాము మాట్లాడుతూ ప్రేమ, శాంతి, సహనం కలిగి ప్రపంచంలో యావత్ మాన వాళి జీవించడమే యేసు క్రీస్తు జననమ న్నారు. క్రిస్టమస్ ప్రతీ కుటుం బంలోనూ వెలుగులు నింపాలని నిండు మనస్సుతో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు పితాని తేజ, వల్లూరి రాజా స్టేట్ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్, గరగా రామ లక్ష్మణ్, స్టేట్ ప్రోగ్రామింగ్ కమిటీ మెంబర్ జనసేన, జన సైనికులు ఆకుల మని, చీపురుపల్లి చంటి, బుల్ల బాయిరెడ్డి నగర్ నాయకులు రవి తేజ, శ్రీనివాస్, టీడీపీ నాయకులు గోవిందు, సుందరపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాల జేఏసీ సమావేశం

విశాలాంధ్ర - పిఠాపురం : చేనేత సొసైటీలకు ఆప్కో సంస్థ చెల్లించవలసిన 170 కోట్ల రూపాయల బకాయిలను తక్షణం చెల్లిం చాలని..చెల్లించని పక్షంలో సంక్రాంతి పండుగ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగుతామని ఆలిండియా వివర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు పప్పు దుర్గా రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిఠాపురం సూర్యరాయ గ్రంథాలయం ఆవరణంలో చేనేత కులాలకు చెందిన నాయకులతో కలిసి పప్పు దుర్గా రమేష్ పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పప్పు దుర్గా రమేష్ చేనేత కార్మికులు పడుతున్న సమస్యలను తెలియజేశారు. ఈ సమావేశంలో కొమ్మాకుల సత్యనారాయణ, పడాల అప్పారావు, ఇసుకపల్లి సత్యనారాయణ, జక్కిలింకి రమేష్, కాకి సత్తిబాబు, జోగా శ్రీనివాస్, తెడ్లకు శ్రీనివాస్, శీరం నాని, బిడి గంట రవి తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులు సంఘటితం కావాలి

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ సంఘటితం కావాలని బీసీ/ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం అన్నారు. కాకినాడ జయ రెసిడెన్సిలో గురువారం కాకినాడ జిల్లా బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వాసంశెట్టి కామేశ్వర రావు అధ్యక్షతన బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం విశిష్ట అతిథులుగా డ్వామా, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ హాజరై మాట్లాడారు. సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2026 సంవత్సరపు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖామాత్యులు నారా లోకేష్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారని తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విచ్చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు కింజరపు అచ్చేనాయుడు, హౌసింగ్ శాఖ మాత్యులు కొలుసు పార్థసారథి, ఎక్సైజ్ శాఖ మాత్యులు కొల్లు రవీంద్ర, రెవెన్యూ శాఖామాత్యులు అనగాని సత్య ప్రసాద్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మాత్యులు ఎస్ సవిత, వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు సత్య కుమార్ యాదవ్, కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్, ఎన్ఆర్ఐ ఎంపవర్మెంట్ అండ్ రిలేషన్ శాఖామాత్యులు కొండపల్లి శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. ఏపీడీ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ హక్కుల సాధన కోసం ఉద్యోగులు అందరు ఐక్యతగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులందరూ జనవరి, 4,2026 తేదీన వేలాదిగా విజయవాడ తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గుత్తుల వీరబ్రహ్మం కోరారు. కాకినాడ జిల్లా బీసీ ఓబిసి ఉద్యోగులు సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు చేతుల మీదుగా రాష్ట్ర మహాసభ బ్రోచర్లు ఘనంగా ఆవిష్క రించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జోగా రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అద్దంకి వెంకన్న బాబు, రామ రాఘవ, ముల్లు సత్యనారాయణ, గౌరవ సలహాదారులు దొమ్మేటి సుధాకర్, ప్రొఫెసర్ ఇళ్ళ దోసగిరిరావు సిద్ధి వెంకటేశ్వరరావు, కాకినాడ నగర అధ్యక్షులు కదలి నాగరాజు, వంచర్ల వీరభద్రరావు, డాక్టర్ ఏడుకొండలు, నక్క వెంకటేశ్వర్రావు, వీరవల్లి గోపీకృష్ణ, మురళి, తేజ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ బాలగంగాధర్ కుటుంబానికి

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరామర్శ



విశాలాంధ్ర - గండేపల్లి : జడ్ రాగంపేట శివారు రాజమండ్రి రోడ్డులోని ఆదిత్య హాస్పిటల్ అధినేత బాల గంగాధర్‌రావు తండ్రి తెలుగు పండిట్, మాజీ విశ్వవిందు పరి షత్ రాజమండ్రి జిల్లా అధ్యక్షులు మేకా సుబ్బారావు ఇటీ వలే మృతి చెందడంతో గురువారం బాల గంగాధర్ రావు స్వగృహంలో సుబ్బారావు చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించి డాక్టర్ బాలగంగాధర్ కుటుం బాన్ని జ్యోతుల నెహ్రూ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్గీ య మేకా సుబ్బారావు తెలుగు పండిట్‌గా తెలుగు విద్యను విద్యార్థులకు బోధిం చడంతోపాటు విశ్వ హిందూ ధర్మ పరి రక్షణ కోసం ఎంతో కృషి చేశారని ఆయన రాజమండ్రి జిల్లా పరిషత్ అధ్యక్షులుగా నాలుగు పర్యాయాలు పనిచేశారని ముఖ్యంగా 30 సంవత్సరాల క్రితం అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం జైశ్రీరామ్ అని ఇటికలపై రాయించి ప్రతి ఇంటి నుంచి ఒక ఇటుకు సమకూర్చి అయోధ్య పంపించడంలో కీలకపాత్ర పోషించారని ఎమ్మెల్యే ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్వి ఎస్ అప్పల రాజు, జీను మణిబాబు, పాం డ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, పెద్దా పురం వెంకటేశ్వర రైస్‌మిల్ అధినేత వల్లూరి సూరి బాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, పీలా మహేష్, రవితేజ మెడికల్ అధినేత వెంకట గంగాధర్, దాపర్తి సీతారామయ్య, కొండ్రోతు శ్రీను, బాలు రెడ్డి పాల్గొన్నారు.

కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్‌లో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్‌లో క్రిస్మస్ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రెడ్డిపల్లి రాజేష్ అధ్యక్షతన, కార్యదర్శి డెంకాడ మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి, సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అధ్యక్షులు రెడ్డిపల్లి రాజేష్ మాట్లాడుతూ, కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్‌లో కుల, మతాలకు అతీతంగా అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ రంజాన్, క్రిస్మస్, ఉగాది వంటి పర్వ దినాలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ పాత్రికేయులు సాయినాథ్ మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా సౌహార్ద వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ క్రిస్మస్ వేడుకల కార్యక్రమంలో ప్రెస్ క్లబ్‌కు చెందిన పలువురు సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గుత్తుల గంగాధర్

క్రిస్మస్, సంక్రాంతి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామానికి గుత్తుల గంగాధర్ విజయభారతి దంపతుల ఆధ్వర్యంలో సూరంపాలెం పంచాయతీ పరిధిలో ప్రతి గడపకు వెళ్లి క్రిస్టమస్, నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ఒక స్వీట్ బాక్స్, క్యాలెండర్ పంచి పెట్టారు. అనంతరం వాళ్ళ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోసిన బాబురావు, ప్రగడ రెడ్డి వీరబాబు, గల్లా కృష్ణ మాధవ్, అల్లం మూర్తి, అబ్బులు, పసుపులేటి సుబ్రహ్మణ్యం, చెల్లే సత్తిబాబు, పల్లపాటి సతీష్, గుత్తుల గంగాధర్ యువసేన, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

వైసీపీ నేత మురళీ కృష్ణం రాజు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కరుణామయిని దీవెనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణం రాజు అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో కల్వరి బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మురళి రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మురళి రాజు కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. 50 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్,ధర్మవరం గ్రామ సర్పంచ్ బెంతు కుర్తి సుశీల అబ్బాయి, ప్రత్తిపాడు ఎంపీటీసీ భాస్కరరావు, బొల్లు నాగేశ్వర రావు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, తూపాటి బాబ్జి, యాళ్ల ఏసు, రాపర్తి ప్రసాద్, జువ్వల ముసలయ్య, రాపా అప్పన్న, ముదదా ఏసు, రాపా నీలాబాబు, మారెళ్ళ అప్పనబాబు, జువ్వల రాజా, కల్వరి బాప్టిస్ట్ చర్చ్ సభ్యులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు
A.S.No.18/2025

మధ్య
అర్జిల్ల సత్యానందరావు మరియు వగైరాలు
...అప్పిలెంట్లు
మరియు
కండిపిల్లి వెంకటేశ్వరరావు మరియు వగైరాలు
... రెస్పాండెంట్స్

3వ రెస్పాండెంట్: దెయ్యాల సూర్యప్రకాష్‌రావు
తండ్రి: లేటు పోతురాజు, వయస్సు: 55 సం॥లు, డోర్ నెం.5-23, విఘ్నేశ్వరనగర్, సూర్యారావుపేట శివారు, ఇంద్రపాలెం, కాకినాడ రూరల్ మండలం
4వ రెస్పాండెంట్: దెయ్యాల విజయభాస్కరరావు
S/o. లేటు పోతురాజు, వయస్సు: 52 సం॥లు, డోర్ నెం.5-23, విఘ్నేశ్వరనగర్, సూర్యారావుపేట శివారు, ఇంద్రపాలెం, కాకినాడ రూరల్ మండలం

పై నెంబరు అప్పీలు నందు 3వ, 4వ రెస్పాండెంట్స్‌లకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినను తీసుకొనక బుద్ధిపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. సదరు రెస్పాండెంట్స్ హాజరు నిమిత్తం **ది.03-02-2026**వ సం॥రం తేదీన వాయిదా వేసియున్నారు. మీరు ఆరోజున ఉదయం 10.30 లకు మీరు స్వయంగా కానీ, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియ జేసుకొనవలెను. లేని యెడల పై అప్పీలు మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం)

అప్పిలెంటు తరపున అడ్వకేట్,
జి.వి.కృష్ణప్రకాష్,
శ్రీరామ్‌నగర్, కాకినాడ. సెల్: 98481 62554

కాటన్ గోదావరి ట్రోఫీ పడవ పోటీలకు సన్నాహాలు

"మన ఊరు-మన పండుగ-మన సంబరాలు" భావనతో ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలంలో "మన ఊరు-మన పండుగ-మన సంబరాలు" అనే భావనతో నిర్వహించనున్న సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలను బాధ్యతాయుతంగా, సమన్వయంతో నిర్వహించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించి తూర్పుగోదావరి జిల్లాలోని రాజ మహేంద్రవరం కేంద్రంగా ఉన్న గేల్ కార్యాలయ అధికారిగా కెఎస్‌వి రావు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొని తమ సహకారం అందిస్తామని తెలిపారు. కాటన్ గోదావరి ట్రోఫీ పడవ పోటీలను కేరళ తరహాలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కమిటీతో ప్రభుత్వం కలిసి సమన్వయంతో ఈ సంబరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా డ్రాగన్ పడవ పోటీలు, ఈతల పోటీలు, ఫుడ్ ఫెస్టివల్ వంటి ఆకర్షణీయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రజలకు వినోదాన్ని అందించేలా సినీ ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో ఆత్రేయపురం మండల టీడీపీ అధ్యక్షులు కె రామకృష్ణంరాజు, వెచ్చా అనిల్ మండల పార్టీ యూత్ ప్రెసిడెంట్, సతీష్, సలాది నాగేశ్వరరావు, దండు సతీష్, భావన శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొని కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముసలమ్మ అమ్మవారి ఉత్సవ ప్రారంభోత్సవంలో అపశృతి

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని శివకోటి పుంతలో ముసలమ్మ అనే కుంతలేశ్వరి అమ్మవారి జాతర మహోత్సవం ప్రారంభ వేడుకలల్లో అపశృతి నెలకొంది. గురువారం జరగాల్సిన అమ్మవారి గ్రామ ప్రవేశం సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు కాళికాదేవి, దేవతా మూర్తుల వేషధారణతో నృత్యాలు చేసే నాట్య బృం దాలను బుధవారం రాత్రి రాజమహేంద్రవరం నుండి తీసుకువచ్చారు. వీరు బస చేసేందుకు అమ్మవారి ఆలయం ఎదురుగా నిర్మాణంలో ఉన్న మూడు అంతస్తుల కళ్యాణ మండపం భవనం ఇచ్చారు. గురువారం తెల్లవారు జామున పాలపర్తి భవ్యశ్రీ,(17) అనే యువత మెట్లు దిగుతుండగా ప్రమాదవ శాత్తు రెండవ అంతస్తు మెట్ల నుండి జారి పడింది. వెంటనే ఆలయ కమిటీ సభ్యులు, తోటి కళాకారులు ఆమెను రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. తలకు బలమైన గాయం కావడంతో ఆమె మృతి చెందిందని వైద్యులు ధృవీకరించారు. పొట్ట కూటికోసం వచ్చి ఇలా మృత్యవాత పడండం కుటుంబ సభ్యులు, తోటి కళాకారులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఆసుపత్రి వద్ద మృతురాలి తల్లి చినపాప రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. సోదరి పాలపర్తి మధు పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడలో నటి మీనాక్షి చౌదరి సందడి

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : కాకినాడ నగరంలో సంక్రాంతి వస్తు న్నాం సినిమాలో విక్టరీ వెంకటేష్ సరసన నటించిన నటి మీనాక్షి చౌదరి సందడి చేశారు. గురువారం మెయిన్ రోడ్‌లో లక్కీ సిగ్నేచర్ ఫ్యామిలీ షో రూంను ఆమె ప్రారంభించి హాజరైన ప్రేక్షకులను తన అభివాదాలు ముద్దు ముద్దు మాటలతో ఆనందపరిచారు. పూర్తిగా మహిళల కోసం ఏర్పాటు చేసిన ఈ షోరూంలో అందరి శుభాశీస్సులు అందించాలని మీనాక్షి కోరారు. మహిళల కోసం చీరలు, గాగ్రాలు, లెహంగాలు, ఎన్నో రకాలను అందుబాటు ధరలో అంది స్తోందన్నారు. నటి మీనాక్షిని చూసేందుకు జనం ఎగబడ్డారు. దీంతో పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. లక్కీ షో రూంను ఆమె తిరిగి రకరకాల చీరలను తిలకించగా వాటి వివరాలను సిబ్బంది మీనాక్షికి తెలియజేశారు.

విశాలాంధ్ర
డా॥ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తహశీల్దార్‌గా రాపాక దుర్గ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల నూతన తహసీల్దార్‌గా రాపాక దుర్గ శ్రీరామ చంద్రమూర్తి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ, మండలంలోని రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామని, సిబ్బంది సహ కారాలతో ప్రజల సమస్యలను సత్వరమే పరి ష్కరించే దిశగా చర్యలు తీసు కుంటామని ఆయన స్పష్టం చేశారు. శ్రీరామచంద్ర మూర్తిని పలువురు మర్యాద పూర్వకంగా కలిసి అభి నందనలు తెలిపారు.

చరిత్రకారుడు డాక్టర్ మెట్ల

మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర - అమలాపురం : చరిత్రపుటల్లో అమలాపురానికి ఘన కీర్తిని తెచ్చిన చరిత్రకారుడు స్వర్గీయ మెట్ల సత్యనారాయణరావు అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొనియాడారు. డాక్టర్ మెట్ల పదవ వర్ధంతినీ పురస్కరించుకుని గురువారం మెట్ల ఘాట్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ మెట్ల సత్యనారా యణరావు స్మృతి చిహ్నానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ డాక్టర్ మెట్ల తెలుగుదేశం పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. ప్రజాసేవకు అంకితమైన ఆయన జీవితం తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి, ప్రజాస్వామ్య బలోపేతానికి విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్ల తన యులు రమణబాబు, మనుమడు మెట్ల సత్య, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, అమలాపురం మున్సి పల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, బీజేపీ పూర్వపు జిల్లా అధ్యక్షుడు యాళ్ళ వెంకట రామ మోహన్ రావు(దొర బాబు), అముడా చైర్మన్ అల్లాడ సోంబాబు, అమలాపురం సొసైటీ అధ్యక్షుడు అల్లాడ శరత్ బాబు, నల్లా స్వామి, నల్లా సుబ్బారావు, బీజేపీ పూర్వ ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, వాసంశెట్టి చిన బాబు, జిల్లా ఉపాధ్యక్షులు అడపా శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర సాయి, అరిగెల తేజ వెంకటేష్, బండి శ్రీని వాస్, కొమ్ముల సురేష్, దొంగ శ్రీను, తాటికాయల సుధీర్, బొబ్బిలి బాబి, ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బాబి, శ్రీవెం కటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ అబ్బులు, జంగా అబ్బాయి, వెంకన్న, పలవల శివరావ్, బత్తుల ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా అటల్ జయంతి

విశాలాంధ్ర - ఐ పోలవరం : వాజ్‌పేయి యువతకు మార్గదర్శి. బిజెపి అగ్రనేత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలు ఐ పోలవరం మండలంలో గురువారం ఘనంగా జరిగాయి. వాజ్పేయి భారతదేశయువతకి ఒక మార్గదర్శని, రాజకీయ నాయకులకు దిక్సూచని, దేశ ప్రధానిగా నిస్వార్ధంగా పనిచేశారని పలువురు వక్తలు అయన సేవలను కొనియాడారు. వాజ్పేయి నిస్వార్థ సేవలు, నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొల్ల కోటి వెంకటరెడ్డి అన్నారు. గుత్తెనదీవి గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ ఫేయి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముమ్మడివరం అగ్రి కల్చర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొల కోటి వెంకటరెడ్డి జ్యోతి వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి వాజ్పేయి చేసిన సేవలు గురించి సాయిరాం విద్యానికేతన్ అధినేత సలాది శ్రీనివాస్ కొనియాడారు. స్వర్ణ చతుర్భుజి పథకం ద్వారా దేశవ్యాప్తంగా ఫోర్ లైన్స్ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు నాలుగు లైన్ల రోడ్లను విస్తరింప చేశారన్నారు. వాజ్ పై జయంతి కార్యక్రమంలో మట్ట శివకుమార్, సఖి రెడ్డి శ్రీనివాస్, గ్రంధి సూర్యనారాయణ గుప్తా, సుంకర నాగేశ్వరావు, రెల్లు గంగాధరం, రాయపురెడ్డి భైరవమూర్తి, శీలం కృష్ణ, నంద్యాల నరసింహస్వామి, రెడ్డి రమణారావు, మట్ట చైతన్య మనీస్వర్, మోహిత్ తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

విశాలాంధ్ర - అమలాపురం : భారత మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్ పాయి జయంతి సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు ఆర్వి నాయుడు అధ్యక్షతన అటల్ బిహారీ వాజ్పేయి శత జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని వారికి ఘన నివాళులర్పించారు. బిజెపి సీనియర్ నాయకులు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ యాళ్ల దొరబాబు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు ముఖ్య అతిథిగా పాల్గొని అటల్ బిహారీ వాజ్పేయికు నివాళులర్పించారు. యాళ్ల దొరబాబు మాట్లాడుతూ దేశానికి ఆదర్శవంతమైన అటల్ బిహారీ వాజ్పేయి అడుగుజాడల్లో నేటి యువత నడవాలని అన్నారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు మాట్లాడుతూ గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా ప్రతి పల్లెకు లింకు రోడ్లు ఏర్పాటు చేశారన్నారు. స్వర్ణ చతుర్భుజి పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఫోర్ లైన్స్ రోడ్లను విస్తరింప చేసారన్నారు. ఈ కార్యక్ర మంలో బిజెపి పూర్వపు జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు అడపా శ్రీను, చిలకమర్రి కస్తూరి, చిలకమర్రి సాగర్, వాడపల్లి దేవస్థానం డైరెక్టర్ శిష్ట కుటుంబ రావు, సుంకర సాయి, కట్ట నారాయణమూర్తి, నల్ల సత్తిబాబు, గుమళ్ళ మ్మల్లారెడ్డి నాయుడు, ఎర్రమిల్లి పాండురంగారావు, కర్రీ తాతారావు, గోనుమడతల కనకరాజు, పరబతులుల బత్తుల సుబ్బారావు, కట్ట జనార్ధన్, తేజ వెంకటేష్, శంకర్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - అమలాపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, జాతీయ కౌన్సిల్ మెం బర్, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ పాల్గొని వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ రాజకీయాలలో భీష్మ పితామహుడు వాజ్ పేయి అని అన్నారు. రాజనీత జ్ఞుడుగా, రాజకీయాలలో అజాతశత్రువు అనే గుర్తింపు ఆయనకు ఉంది. ఆయన హయాంలో జరిగిన పోక్రాన్ అణు పరీక్షలు, స్వర్ణ చతుర్భుజి రహదారుల నిర్మాణం, గ్రామీణ రోడ్ల అభివృద్ధి లాంటి కార్యక్రమాలు భారతదేశ గమనాన్ని మార్చే శాయన్నారు. దేశానికి వాజ్ పేయి చేసి సేవలు చిరస్మరణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అయ్యల భాషా, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు చిలకమర్తి కస్తూరి, ఇళ్ల సత్యనారా యణ, తిక్కా సత్యనారాయణ, సంసాని రత్న కుమార్, దాకే వెంకటరావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పెదపూడి : భారతీయ జనతా పార్టీ దేశ మాజీ ప్రధాన మంత్రి ఏబీ వాజపేయి జయంతి వేడుకలు పెదపూడి గ్రామంలో ఎన్డీఏ కూటమి అధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వ హించారు. బిజెపి మండల అధ్యధ్యక్షుడు ముమ్మిడి శివ, స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు పుట్టా గంగాధర్ చౌదరి, బిజెపి నియోజకవర్గ కో కన్వీనర్ ముర మళ్ల వెంకటరమణ, తిబిరిశెట్టి గణేష్ తదితరులు వాజ్పేయి చిత్రపటానికి పూలమాలలు వేశి నివాళులు అర్పించి, అందరికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ప్రధాన మంత్రి వాజ్పేయి హాయంలో దేశం విశేష అభి వృద్ధిని సాధించిందని, ఆయన్ని అందరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని పొదలాడ శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు గురువారం వారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాస్టర్ ఎర్నెస్ట్ పాల్ పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని విద్యార్థినీ, విద్యార్థులకు అందించారు. సాటి వారిని ప్రేమించి సమాజ అసమానతలు తొలగించుకోవడమే క్రీస్తు బోధనలు ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం జాతీయ గదినో త్సవం సందర్భంగా నిర్వహించిన గణిత పోటీలలో విజేతలకు శాంతి నికేతన్ స్కూల్ కరస్పాండెంట్ బి నాగరాజు మెమంటో సర్టిఫికెట్స్ అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శ ఆకట్టు కున్నాయి. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి విద్యార్థినీ, విద్యా ర్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ప్రసన్న, ప్రిన్సిపాల్ కేవీవీఎస్ సత్యనారాయణ, ఏఓ నాగదుర్గ, ఉపాధ్యాయ బృందం భవాని, జ్యోతి, దేవి, కావ్య, అపర్ణ, కనకదుర్గ, అలేఖ్య పాల్గొన్నారు.

కొమరగిరి క్రిస్మస్ వేడుకలో దాట్ల

విశాలాంధ్ర - ఐ పోలవరం : కోమరిగిరి గ్రామంలో గురువారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ప్రభుత్వవిప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు క్రైస్తవ సమాజానికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్మస్ అనేది ప్రేమ, శాంతి, కరుణ మరియు సోదరభావాన్ని ప్రపంచానికి చాటి చెప్పే పవిత్ర గొప్ప పండుగ అంటూ తెలిపారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో జీవిస్తూ, ఒకరికొకరు సహాయం చేసుకునే విలువలను క్రిస్మస్ మనకు గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరికీ శాంతియుతమైన, సంతోషభరితమైన క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతిఇంటికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. అన్ని మతాల మధ్య సమన్వయం, సామాజిక ఐక్యతతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు, స్థానిక నాయకులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర - రావులపాలెం : స్థానిక లిటిల్ ఫ్లాక్ లూథరన్ దేవాలయంలో కన్నుల విందుగా క్రిస్మస్ సంబరాలు గురువారం చైర్మన్ రెవ డామియన్ ఇశ్రాయేలు సమీరా అధ్యక్షతనలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెవ పండు డేవిడ్ రాజు, పాస్టర్ స్పర్జన్ రాజు హాజరైయ్యారు. ఈ సందర్భంగా రెవ పండు డేవిడ్ రాజు మాట్లాడుతూ సమస్త మానవాళికి శాంతి, ప్రేమ సమాధానం కలిగి ఈ సమాజంలో ఎలా నడుచుకోవాలో క్రీస్తు బోధలు తెలుపుతున్నాయని కొనియాడారు. అహింస మార్గంలో శాంతి యుతంగా పొరుగువారిని ప్రేమిస్తూ సమాధానం కలిగి ఉండడమే నిజమైన క్రిస్మస్ అని

తెలియజేసారు. క్రిస్మస్ కేకును కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సుండేస్కూల్ చిన్నారులు నాటికలు, నృత్యాలతో అలరించారు. ఈ క్రిస్మస్ వేడుకలలో అధిక సంఖ్యలో భక్తజనం హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - సామర్లకోట : మన జీవితాలు ఆనందమయం కావాలంటే సృష్టికర్త అయిన యేసుక్రీస్తు మన జీవితానికి ఒక చుక్కానీగా ఏర్పాటు చేసుకోవాలని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి కాపరి రెవ బివి రాజు అన్నారు. యేసుక్రీస్తు జన్మదిన వేడుకలైన క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ ప్రజలు గురువారు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. పెద్దా పురం నియోజక వర్గ పరిధిలో 2వందలకు పైబడి క్రైస్తవ దేవాలయా లుండగా అన్ని దేవాలయాల్లో ఈ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దైవజనులు ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ మానవుల పాపాలను పరిహరించడానికి దీనునిగా యేసుక్రీస్తు ఈ లోకంలో జన్మించినట్టు చెప్పారు. దీనులకు న్యాయం తీర్చుటకు, మనకు ఘనతను ఇచ్చేందుకు, మనిషికి స్వతంత్రత ఇచ్చేందుకు, పరలోకానికి మనలను చేర్చేందుకు యేసుక్రీస్తు భూ లోకానికి వచ్చినట్టు చెప్పారు. కాగా ప్రధానంగా సామర్లకోట పట్టణంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, ఆగస్తానా లూథరన్ చర్చి, ఆంధ్ర జూబ్లీ బాప్టిస్ట్ చర్చి, ట్రూ గాస్పెల్ బాప్టిస్ట్ చర్చి, షాలేం బాప్టిస్ట్ చర్చి, బెరకా బాప్టిస్ట్ చర్చి, పెద్దాపురం పట్టణంలోని బైబిల్ మిషన్ చర్చిలు, లూథరన్ చర్చిలతో పాటు రెండు పట్టణాల్లోని అన్ని దేవాలయాల్లో లోక రక్షకుడు అయిన యేసుక్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

విశాలాంధ్ర - పెద్దాపురం : ప్రతీ విశ్వాసిక్రీస్తును ఆరాధించడమే అసలైన క్రిస్మస్ అని క్రీస్తు శాంతి ప్రార్ధన మందిరం వ్యవస్థాపకులు నంగిన సత్యానందం, క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సిజిఎం) వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్‌లు అన్నారు. క్రిస్మస్ ఆరాధనల్లో భాగంగా గురువారం మండలంలోని దివిలి, చదలాడ, తిరుపతి, కాండ్రకోట, పిఠాపురం మండలం విరవ గ్రామాల్లోని క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా చర్చిల్లో ప్రసంగిస్తూ క్రిస్మస్ అంటే కేవలం వేషదారణ సంబరం కాదని, అసలైన క్రీస్తును ఆరాధించడమేనన్నారు. ప్రతీ వ్యక్తి ఎప్పుడైతే పూర్తి క్రీస్తును ఆరాధిస్తాడో అప్పుడే అసలైన క్రిస్మస్ జరిగినట్లుని శామ్యూల్ సుదీప్ అన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ తాత వేషదారణలో చిన్నారులను అలరిస్తూ క్రైస్తవ గీతాలు ఆలపించారు. భారీ కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు. వేకువ జామున సండే స్కూల్ విద్యార్థులు క్రీస్తు నేడు పుట్టెను హల్లెలూయ అంటూ నినాదాలతో గ్రామ గ్రామాన భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంగిన శాంతకుమారి, నంగిన ప్రేమలత, మేరీ, శ్యామల, విశాల, కీర్తన్నా, ఆయా గ్రామాల విశ్వాసులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : ఇంద్రపాలెం మౌంట్ కార్మెల్ పాఠశాలలో ముందస్తుగా క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని తాకాయి. ప్రేమ, శాంతి, కరుణకు, నిదర్శనమైన క్రిస్మస్ పండుగను ఆనందో త్సాహాలతో అందరూ జరుపుకున్నారు. ఈ సందర్భంగా మౌంట్ కార్మెల్ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ నానిశెట్టి వీరాంజనేయ సాయిరాం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ...ఆనందం, దయ, ఉదారతలను పంచే క్రిస్మస్ వేడుక జరుపుకోవడం చాలా సంతోషాన్ని కలిగిస్తుందని, అందరూ శాంతి, కరుణ వంటి విలువలను పెంపొందించుకోవాలని, సౌభ్రాతృత్వాన్ని మతసామరస్యాన్ని కలిగి ఉండాలని పిల్లలకు సందేశం ఇస్తూ..క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ వీరాంజనేయ సాయిరాం, పాఠశాల పరిపాలనా విభాగం, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : క్రిస్మస్ వేడుకలు సమాజంలో శాంతి మార్గాన్ని చూపిస్తాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ అన్నారు. గురువారం ప్రత్తిపాడు ఆర్‌సియం చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలతో వేడుకలు ఆరంభించారు. సంఘ సభ్యులు ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగిస్తూ క్రీస్తు చెప్పిన శాంతి సన్మార్గంలో ప్రతి ఒక్కరు పయనిస్తూ పరులకు సేవలు అందించాలన్నారు. ప్రేమ, క్షమ, త్యాగం, మానవ త్వం వంటి విలువలు సమాజానికి అవసరమన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ వేడుకలు శాంతి, సంతోష వాతా వరణంలో జరిగిన వేడుకలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చర్చి లోపల ఏసు క్రీస్తు జన్మ ఘట్టాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక ఏర్పాటు చేశారు. పేదలకు ఆహార పంపిణీ, అవసరమైన వారికి సహాయం వంటి సేవా కార్యక్రమాలను కూడా చర్చి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు వైస్ చైర్మన్ కొమ్ములు కన్నబాబు, యాళ్ల జగదీష్, మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ వెలుగుల నాని, సొసైటీ డైరెక్టర్ మదినే వెంకన్న దొర, గొడే హరీష్, శెట్టి బత్తుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.